

చేపల చెరువులో విషప్రయోగం

- రూ.7 లక్షలు నష్టం
- రామవరపుమోడిలో ఘటన



రామవరపుమోడిలో విష ప్రయోగం జరిగిన చేపల చెరువు

బంటుమిల్లి, మార్చి 18 : మండలంలోని రామవరపుమోడిలోని గూడవల్లి లక్ష్మికి చెందిన 3 ఎకరాల చేపల చెరువులో విషప్రయోగం జరిగి చేపలు చనిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడవల్లి లక్ష్మి చేపల సాగు చేస్తున్నారు. తమ కుమార్తె వివాహం కోసం నాలుగు రోజుల్లో చేపలు పట్టడానికి బేరం కుదుర్చుకున్నారు. ఈలోపే గుర్తు తెలియని వ్యక్తులు విషప్రయోగం చేయడంతో చేపలన్నీ చనిపోయాయి. కుతూరు వివాహం ఎలా చేయాలో తెలియక తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. దాదాపు రూ.7 లక్షలు నష్టం వాటిల్లిందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని గూడవల్లి లక్ష్మి దంపతులు కోరుతున్నారు.



చిలకలపూడిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



చిలకలపూడిలో పరీక్షా కేంద్రం వద్ద తన నెంబరు చూసుకుంటున్న విద్యార్థిని

సజావుగా పది పరీక్షలు ప్రారంభం

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం సజావుగా ప్రారంభమయ్యాయి. 22,615 మంది విద్యార్థులకు 21,499 మంది పరీక్షకు హాజరయ్యారు. 95.07 శాతం హాజరు నమోదైంది. జాయింట్ కలెక్టర్ గీతాంజలి మచిలీపట్నం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్, నిర్మలా హైస్కూల్‌ను సందర్శించారు.

కార్మికులపై కక్షేల?

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో వింతవైఖరి నడుస్తోంది. నగరంలో పారిశుధ్య కార్మికులు విధుల్లో చనిపోతే వారికి పరిహారం ఇవ్వకుండా అధికారులు ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు విధుల్లో సాధారణ మరణం సంభవిస్తే కుటుంబసభ్యులకు రూ.2 లక్షల చొప్పున పరిహారంగా ఇవ్వాల్సి ఉన్నా అమలు జరగడం లేదు. బాధిత కుటుంబ సభ్యులు తమకు పరిహారం ఇప్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించకుండా రేపు, మాపు అని చెబుతూ తమ చుట్టూ తిప్పుకుంటూనే ఉన్నారు.



మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

పరిహారం అందక మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబాల వేదన

- మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో వింత వైఖరి
- పాలకవర్గం తీర్మానించినా నగదు విడుదల చేయకుండా జాప్యం
- 512 మంది కార్మికులకు సంక్రాంతి బోనస్ శూన్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పారిశుధ్య విభాగంలో కార్మికులుగా పనిచేస్తున్న వారు సాధారణ మరణం పొందితే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు పరిహారంగా ఇవ్వాలి. ఇటీవల మునిసిపల్ కార్మికులు సమ్మె చేసిన సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే ఈ పరిహారం మొత్తాన్ని రూ.7 లక్షల వరకు పెంచారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 2019 నుంచి ఇటీవల వరకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు 15 మంది చనిపోయారు. మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు పరిహారం అందించాలని కోరుతూ పలుమార్లు యూనియన్ నాయకులు అన్నిపత్రాలు మునిసిపల్ కార్యాలయంలో అందజేశారు. పత్రాలన్నీ సక్రమంగానే ఉన్నాయని, పరిహారం విడుదల చేస్తామని పాలకులు, అధికారులు చెబుతూ వస్తున్నారు కానీ నగదు మాత్రం విడుదల చేయడంలేదు. పాలకవర్గం సమావేశంలో ఆమోదం పొందితే వెంటనే నగదు విడుదల చేస్తామని అధికారులు చెబుతూ వచ్చారు.

పాలకవర్గం ఆమోదం తెలిపినా..

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డెప్యూటీ మేయర్లను మార్పు చేసే సమయంలో పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు వారి వద్దకు వెళ్లారు. మరణించిన కార్మికులకు సంబంధించిన పరిహారం పెండింగ్ ఉందని ఇప్పించాలని కోరారు. నూతన మేయర్, డెప్యూటీ మేయర్‌లు ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు తీసుకున్నారు. తాము బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి సంతకం ఈ ఫైలుపైనే చేస్తామని హామీ ఇచ్చారు. నూతన మేయర్, డెప్యూటీ మేయర్‌లు బాధ్యతలు చేపట్టి నెలలు గడుస్తున్నా ఈ ఫైలుకు మోక్షం లభించలేదు. పైగా కొందరు కార్పొరేటర్లు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు మరణిస్తే మునిసిపల్ కార్పొరేషన్ నుంచి పరిహారం ఎలా వస్తుందని ఎదురు ప్రశ్నలు వేస్తుండటం గమనార్హం. దీంతో యూనియన్ నాయకులు తాడిగడప పురపాలక సంఘంలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ కార్మికులు చనిపోతే పరిహారం అందించారని, అందుకు సంబంధించిన ఆధారాలను, ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను చూపారు. దీంతో ఎట్టకేలకు మచిలీపట్నం కార్పొరేషన్ పాలకవర్గం సభ్యులు, అధికారులు దిగొచ్చారు. కార్మికుల కుటుంబాలకు పరిహారం అందించేందుకు పాలకవర్గం ద్వారా ఆమోదం తెలిపారు. అనంతరం ఆ ఫైలును అటకెక్కించారు. ఇటీవలే మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన 2024-25 బడ్జెట్‌ను రూ.150 కోట్లతో ఆమోదం తెలిపారు. అయినా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన కొద్ది మొత్తాన్ని పరిహారంగా ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో కార్మికులంతా మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

పండగ బోనస్ ఏదీ?

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 512 మంది కార్మి కులు పనిచేస్తున్నారు. వీరికి సంక్రాంతి పండుగ బోనస్‌గా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున అందజేయాలని పాలకవర్గం ఆమోదం తెలిపింది. సంక్రాంతి పండుగ వెళ్లిపోయి దాదాపు రెండు నెలలు గడిచినా ఇంతవరకు ఈ మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమచేయకుండా మిన్నకుండిపోయారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాలు విడుదల చేసినా, పండగ బోనస్ మాత్రం విడుదల చేయలేదని కార్మికులు వాపోతున్నారు. అధికారపక్షం నాయకులు నామినేషన్ పద్ధతిపై తీసుకునే పనులకు మాత్రం బిల్లులు చకాచకా చేస్తున్నారని, రోజూ పనిచేసే కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను, పరిహారాన్ని విడుదల చేయ కుండా జాప్యం చేయడం ఈ పాలకవర్గానికే చెల్లుబాటు అయ్యిందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువతిపై సవతి తండ్రి లైంగిక దాడి

- నిందితుడి అరెస్టు

గన్నవరం, మార్చి 18 : తను కనకపోయినా కంటికి రెప్పలా చూసుకోవాల్సిన సవతి తండ్రి... కుమార్తెపై రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్న ఘటన గన్నవరంలో సోమవారం వెలుగులోకొచ్చింది. ఆ కీచకుడిని గన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరంలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్న 19 ఏళ్ల యువతి తండ్రి 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఆ తరువాత ఆమె తల్లి మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ముగ్గురూ కలిసి ఉంటున్నారు. సవతి తండ్రిని యువతి చిన్ననాటి నుంచి డాడీ అని పిలిచేది. అతను మాత్రం ఆమెపై కన్నేశాడు. 'మీకు నేనున్నాను. నేనే చూసుకుంటా. మీకు ఏమి కావాలో తెచ్చిపెడతా'అని యువతికి మాయ మాటలు చెప్పాడు. ఇంట్లో తల్లి లేని సమయంలో రెండేళ్లుగా యువతిపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. 'ఈ విషయం ఎవరికి చెప్పొద్దు. మీ అమ్మకు కానీ, ఎవరికైనా కానీ చెబితే చంపుతా. నేను కూడా మీ పేర్లు రాసి చనిపోతా' అని బెదిరించాడు. వారం క్రితం యువతి ఫోన్‌లో వచ్చిన ఒక మెసేజ్ చూసి సవతి తండ్రి ఆమెను కొట్టాడు. ఎందుకు కొట్టావని యువతి తల్లి ప్రశ్నించింది. ఫోన్‌లో మెసేజ్‌లు వస్తున్నాయని అందుకే కొట్టానని చెప్పాడు. తనపై సవతి తండ్రి లైంగికదాడి చేస్తున్న విషయాన్ని రెండ్రోజుల క్రితం యువతి తన తల్లికి చెప్పింది. ఎందుకు అలా చేశావని నిందితుడిని నిలదీయగా తానేమి చేయలేదని, తనకేమీ తెలియదని బుకాయించాడు. దీంతో తల్లితో కలిసి యువతి గన్నవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు 111-2024, 376(2) (ఎన్), 323, 506 ఐపీసీ సెక్షన్లు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సరఫరా

20 నుంచి ట్యాంకర్ల ద్వారా పంపిణీ

- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు వెల్లడి

- 6లో..

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

డీఆర్వోకి సర్పంచ్ వినతి

- 6లో..



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-22 (మంగళ)

సహర్ (ఉదయం) : 4-52 (బుధ)



వైసీపీ నాయకుడు శేఖర్ బాబుతో కలిసి గుడివాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వలంటీర్ భారతి



వైసీపీ నాయకుడు శేఖర్ బాబుతో కలిసి గుడివాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వలంటీర్ షకీలా

వలంటీర్లా..? వైసీపీ కార్యకర్తలా..?

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి పార్టీ తరఫున ప్రచారం

- గుడివాడ, గన్నవరం, మచిలీపట్నంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాల పంపిణీ
- ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థన
- పట్టించుకోని అధికారులు

ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వైసీపీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. వలంటీర్లను వెంటపెట్టుకుని ఇంటింటా తిరుగుతున్నారు. వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వైసీపీ ఊరేగింపుల్లో, ర్యాలీల్లో పాల్గొంటున్నారు. ఇంటింటికీ తిరిగి జగన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. గన్నవరం, గుడివాడ, మచిలీపట్నంలలో ఇదే జరుగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. - మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

గన్నవరంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం

కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 16న షెడ్యూల్ ప్రకటించగా, అదేరోజు సాయంత్రం గన్నవరం మండలం సూరంపల్లిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో వలంటీర్లు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఆలస్యంగా వెలుగు చూశాయి. గ్రామంలో జరిగిన ర్యాలీలో వైసీపీ నాయకులతో కలిసి వలంటీర్లు ఎ.వంశీకృష్ణ, నాగార్జున ఇంటింటికీ తిరిగి వైసీపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

గుడివాడలో వైసీపీ కరపత్రాలు పంచుతూ..

గుడివాడ పురపాలకసంఘం 24వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు పసలాది శేఖర్‌బాబు సోమవారం వలంటీర్లను తీసుకుని వార్డులో ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేశారు. వలంటీర్లు భారతి, షకీలా సోమవారం వైసీపీ నాయకుడితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ వైసీపీకి చెందిన కరపత్రాలను పంపిణీ చేశారు.

పట్టించుకొనేవారేరి?

జిల్లాలో వైసీపీ కార్యకర్తలను, నాయకులను గతంలో గృహసారథులుగా ప్రభుత్వం నియమించింది. పథకాల అమలులో వలంటీర్లతోపాటు గృహసారథులకు పర్యవేక్షణ బాధ్యత ఇచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా మచిలీపట్నంలోని వివిధ డివిజన్‌లలో గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్నారు. సాయంత్రం సమయాల్లో వీరు ఇంటింటికీ వెళ్లి వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్నా పట్టించుకొనేవారే లేకుండా పోయారు.

పెనమలూరు తెర పైకి కొత్త పేర్లు



ఆలపాటి రాజేంద్రప్రసాద్



దేవినేని చందు



వసంత కృష్ణప్రసాద్

- పరిశీలనలో రాజేంద్రప్రసాద్, దేవినేని చందు
- మైలవరంపై వీడిన సస్పెన్స్
- వసంత కృష్ణ ప్రసాద్ పేరు ప్రకటన లాంఛనమే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) పెనమలూరు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగే టీడీపీ అభ్యర్థి ఎవరన్న దానిపై ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. తాజాగా అభ్యర్థి ప్రకటనపై జాప్యం జరుగుతుండటంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బోడె ప్రసాద్‌కు ఈసారి అవకాశం కల్పించలేకపోతున్నామని పార్టీ అధినేత స్వయంగా తెలపడంతో ఇక్కడి నుంచి ఎవరు బరిలో దిగుతారన్న అంశంపై సస్పెన్స్ నెలకొంది. తాజాగా పెనమలూరు తెరపైకి తెనాలి నియోజకవర్గ టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు వచ్చింది. ఆయనతోపాటు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని చందు పేరునూ పరిశీలిస్తున్నట్టు సమాచారం. యువ ఓటర్లకు సంబంధించి పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించడంలో చందు చురుగ్గా ఉన్నారు. టీడీపీ యువనేత నారా లోకేశ్‌తోనూ ఆయనకు మంచి అనుబంధమే ఉంది. దీంతో పెనమలూరు టికెట్ తనకు కేటాయించాలని చందు పార్టీ పెద్దలను కోరుతున్నారు. ఇప్పటికే ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ రేసులో ఉన్నారు. ఈ ముగ్గురిలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సీనియర్ నాయకుడు. తెనాలి నియోజకవర్గం నుంచి బరిలో దిగాల్సిన ఆయన పొత్తులో భాగంగా తన స్థానాన్ని జనసేనకు త్యాగం చేశారు. ఆ స్థానం నుంచి నాదెండ్ల మనోహర్ బరిలోకి దిగుతున్నారు. దీంతో ఆలపాటిని ఏదో ఒక స్థానం నుంచి బరిలో నిలపాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పెనమలూరు సీటు ఈ ముగ్గురు నేతల్లో ఎవరిని వరిస్తుందో అన్న విషయం రెండుమూడు రోజుల్లో తేలిపోనుంది.

వసంతకు లైన్ క్లియర్

మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్‌కు లైన్ క్లియర్ అయినట్టేనని సమాచారం. ఈ మేరకు పార్టీ పెద్దలకు ఆయనకు సమాచారం ఇచ్చారు. కృష్ణప్రసాద్ పేరు ప్రకటించడం లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వసంత ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తూ టీడీపీ నాయకులను కలుస్తూ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించిన తర్వాత దేవినేని ఉమాతో భేటీ అవ్వాలని వసంత భావిస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు కలిస్తే మైలవరంలో టీడీపీ గెలుపు నల్లేరు మీద నడకేనని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

కోడ్ ఉల్లంఘనా..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బృందాలు రంగంలోకి దిగాయి. ఈ బృందాల కన్నుగప్పి ఎక్కడైనా ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తుంటే ఎంసీసీ బృందాల దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను జాతీయ, రాష్ట్రస్థాయిలో రోజూ సమీక్షిస్తారు. కాబట్టి మోడల్ కోడ్ ఉల్లంఘనలను ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఈ ఫిర్యాదు చేయొచ్చు. 22 భాషలకు ఇది సహకరిస్తుంది. కాల్ చేసేటపుడు మీ భాషను ఎంచుకోమని చెబుతుంది. ఇది కేవలం ఫిర్యాదులకే కాదు. దరఖాస్తులకు సంబంధించిన విజ్ఞప్తులు కూడా పెట్టుకోవచ్చు. ఓటరు లిస్టులో మీ పేరు ఉందో లేదో చూసుకోవచ్చు.



దుర్గగుడిలో దర్శన టికెట్లు రీసైక్లింగ్

ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు

- రోజుకు లక్ష రూపాయల పైనే స్వాహా చేస్తున్న వైనం

- 6లో..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం



గవర్నర్‌పేటలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

- కృష్ణాలో 95.07 శాతం హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఉన్నతాధికారులు

మచిలీపట్నం టౌన్/కృష్ణలంక, మార్చి 18 : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. కృష్ణాజిల్లాలో 151 పరీక్షా కేంద్రాల్లో 22615 మంది విద్యార్థులకు 21499 మంది పరీక్షకు హాజరయ్యారు. 95.07శాతం నమోదైంది. జేసీ గీతాంజలి మచిలీపట్నం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్, నిర్మలా హైస్కూల్‌ను సందర్శించారు. ఆమె వెంట డీఈవో తాహెరాసుల్తానా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, గట్టిపోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించామన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దిల్లీరావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సోమవారం ఉదయం గవర్నరుపేటలోని చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్‌ఫోన్లు, ఏవిధమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తీసుకురాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు, అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా 178 కేంద్రాల్లో ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.



సాయిబాబా పాదాలకు నమస్కరిస్తున్న విద్యార్థులు

హై లైఫ్ ఎగ్జిబిషన్



విజయవాడ వరుణ్ నోవాటెల్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న హై లైఫ్ ఎగ్జిబిషన్ (జ్యూయలరీ, బ్రైడల్ కలెక్షన్, ఫ్యాషన్ డిజైన్లు)ను సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రముఖ సినీతార తేజస్వి మాదివాడ.



కేశినేని శివనాథ్, సౌమ్య సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ!

- కేశినేని చిన్ని సమక్షంలో భారీగా చేరికలు

విద్యాధరపురం/నందిగామ, మార్చి 18 : ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతోందని విజయవాడ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. సోమవారం గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నందిగామ వైసీపీ కౌన్సిలర్‌లు, నాయకులు, విజయవాడ 7వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం చిన్ని మాట్లాడుతూ, నందిగామ మునిసిపాలిటీలో వలసల పర్వం ప్రారంభమైందన్నారు. మే13న జరగనున్న పోలింగ్‌తో తాడేపల్లి ప్యాలెస్ గోడలు బద్ధలవుతాయని స్పష్టం చేశారు. చిలకలూరిపేట సభతోనే ప్యాలెస్‌లో పిల్లికి ముచ్చెమటలు పట్టాయని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లాలో జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతుందని చెప్పారు. కౌన్సిలర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న మొండితోక బ్రదర్స్‌కు పతనం మొదలైందని, నందిగామ మునిసిపాలిటీని త్వరలో టీడీపీ కైవసం చేసుకుంటుందన్నారు. 80శాతం వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో 4వ వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గద్దె రమేశ్, 13వ వార్డు కౌన్సిలర్ గద్దె శేషకుమారి, మారం సత్యవతి, 13వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ గద్దె నరసింహరావులతో పాటు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. సౌమ్య మాట్లాడుతూ, నందిగామలో ఈ పరిణామం ఒక సంచలనమని పేర్కొన్నారు. టీడీపీలో చేరిన కౌన్సిలర్‌లకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు కోగంటి బాబు, రాము, కాకర్ల లక్ష్మీనారాయణ, శాకమూరి స్వర్ణలత, కామసాని సత్యవతి, మండవ కృష్ణకుమారి, ఏచూరి రత్నకుమారి, కత్తురోజ్ శ్రీనివాసాచారి, శాకమూరి వంశీధర్, షేక్ రాజా తదితరులు పాల్గొన్నారు. విజయవాడ 7వ డివిజన్ వైసీపీ నుంచి సొంగా సంజయ్ వర్మ ఆధ్వర్యంలో పెంటు అనీల్‌కుమార్, కిమ్మం దుర్గాభవాని, వేణుగోపాల్, పోలేటి రవితేజ, దరిశనపు రమేష్‌లతో పాటు పదుల సంఖ్యలో పార్టీలో చేరారు.

కేశినేని చిన్ని మంత్రాంగం..

నందిగామ నియోజకవర్గంపై పూర్తిస్థాయి దృష్టి సారించిన కేశినేని చిన్ని పట్టణంతో పాటు పలు గ్రామాలలో వైసీపీ పట్ల అంతృప్తితో ఉన్న నేతలను గుర్తించి టీడీపీలో చేరుస్తున్నారు. చాపక్రింద నీరులా కేశినేని చిన్ని, తంగిరాల సౌమ్యలు వైసీపీ అసంతృప్తిని క్యాష్ చేసుకుంటున్నారు. వైసీపీ కౌన్సిలర్లతో టచ్‌లోకి వెళ్లిన చిన్ని ఆ పార్టీని కోలుకోలేని దెబ్బతీశారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు చిన్ని బృందంతో టచ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి బలమైన నేతలను తమ వైపు తిప్పుకున్న చిన్ని, సౌమ్యలు రానున్న రోజుల్లో వైసీపీని దెబ్బకొట్టే వ్యూహంతో ఉన్నట్టు సమాచారం. అరవై శాతం టీడీపీ కేడర్‌ను వైసీపీలోకి చేరుస్తానన్న కేశినేని నాని వ్యాఖ్యలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చిన్ని అదేస్థాయిలో వైసీపీని ఖాళీ చేస్తాడంటూ టీడీపీ నాయకులు చెప్పుకొస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టిన జగన్ : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, మార్చి 18 : చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ విజయవంతం కావడంతో వైసీపీ పాలన పట్ల ప్రజలకు ఉన్న వ్యతిరేకత తెలిపోయిందని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ కార్యాలయం, రైతు బజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలల ఆస్తులను తనఖా పెట్టిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కొనకళ్ల ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రం సహకారంతో 72 శాతం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయగా.. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు పనులను కొనసాగించలేదన్నారు. వైసీపీ పాలన అంతా ఆర్థిక దుర్వినియోగం, అవినీతి కార్యక్రమాలకు మారుపేరుగా మారిందన్నారు. ప్రజాగళంసభకు లక్షల్లో జనం వచ్చి వైసీపీ ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకతను మరోసారి చాటి చెప్పారన్నారు.



వ్యర్థాలతో పూడిపోయిన పంటకాల్వను పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము

గుడివాడకు రెండు నెలల్లో విముక్తి : వెనిగండ్ల

గుడ్లవల్లేరు, మార్చి 18 : అభివృద్ధికి దూరమైన గుడివాడ నియోజకవర్గానికి మరో రెండు నెలల్లో విముక్తి కలగనుందని, కూటమి ప్రభుత్వం రాగానే ప్రజావసరాలను తీర్చే బాధ్యత తమదని టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు మండలం కూరాడగ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో కాపీలను పంపిణీ చేశారు. రాబోయేది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. అనంతరం లాక్‌డౌన్ నుంచి ప్రవహించే పంటకాల్వలో వ్యర్థాలతో నిండిపోవడంతో పరిశీలించిన రాము సెల్ఫీ చాలెంజ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, వల్లభనేని బాబూరావు, గుడివాడ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కళ్యాణపు నవాబు, బాసా శ్రీరామచంద్రమూర్తి, పులిరమేష్, ప్రసాద్, శీరం రమేష్, సాయిన పుష్పావతి, జంగం మోహనరావు, సాయిన బాబూరావు, కృష్ణారావు, ఆకుల శివయ్య, సమ్మెట సాంబయ్య, గోపాల్, నాని, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోతిన మహేశ్‌కు టికెట్ కోరుతూ నిరసన తెలుపుతున్న జనసేన నేతలు

పోతినకు టికెట్ కోరుతూ కార్యకర్తల నిరసన

వన్‌టౌన్ : జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్‌కు సీటు కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని జనసేన యువనాయకులు ప్రకటించారు. మహేశ్‌కు టికెట్ ఇవ్వకపోవడంపై సోమవారం జనసేన యువత ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. నాయకులు, ముస్లిం మహిళలు మహేశ్‌కు టికెట్ ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట నుంచి సామారంగం చౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

పటిష్ఠ సమన్వయానికి
కమాండ్ కంట్రోల్



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు, పోలీసు కమిషనర్ రాణా

- ఎన్నికల విధులపై అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు సమీక్ష

కృష్ణలంక, మార్చి 18 : ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులు బృంద స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ దిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, పోలీస్ కమిషనర్ కాంతి రాణాతో కలిసి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం కార్యకలాపాలను పరిశీలించారు. సీ-విజిల్, కాల్‌సెంటర్, ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఎంసీసీ, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ తదితర విభాగాల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఫ్లయింగ్‌స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్‌స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య పటిష్ఠ సమన్వయ సాధనకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం కీలకమన్నారు. సీ విజిల్, నేషనల్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ సిస్టమ్ (ఎన్‌జీఆర్ఎస్), 1950 తదితర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం ఎంత ముఖ్యమో సరైన విధంగా నివేదికల్లో పొందుపరిచి ఏరోజుకారోజు సమర్పించడం ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు అనుసంధానమవుతూ ఖచ్చితమైన నివేదికలు రూపొందించాలన్నారు. విధుల నిర్వహణలో వేగంతో పాటు ఖచ్చితత్వం కూడా ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్.నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు వున్నారు.

పెయిడ్ ఆర్టికల్స్‌పై నిఘా పెట్టండి

ప్రచార మాధ్యమాల్లో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా పెట్టాలని, ఈ విషయంలో ప్రచార మాధ్యమాల ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కలె



సమాచారశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్

క్టర్ దిల్లీరావు అన్నారు. ప్రచార మాధ్యమాలు అనుసరించాల్సిన విధివిధానాలపై జేసీ పి.సంపత్‌కుమార్‌తో కలిసి సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను మీడియా పాటించాలన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని మాధ్యమాల ప్రతినిధులు సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి పెయిడ్ న్యూస్ అంశాన్ని సునిశితంగా పరిశీలించాలన్నారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) పటిష్ఠ పర్యవేక్షణతో పనిచేయాలన్నారు. నిర్దేశించిన రేట్ కార్డు ప్రకారం పెయిడ్ న్యూస్‌ను గణించి, ఆ వ్యయాన్ని సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. పెయిడ్ న్యూస్‌గా నిర్ధారణ అయిన ఆర్టికల్స్‌కు సంబంధించి రేటు కార్డు ప్రకారం ఖరారు చేయబడిన సొమ్మును సంబంధిత అభ్యర్థికి అనుమతించి వ్యయం కింద జమచేయడం జరుగుతుందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఎఫ్ఎం, కేబుల్‌నెట్‌వర్క్‌లో పెయిడ్ న్యూస్ విషయంలో సంబంధిత ఆర్వో నోటీసులు జారీ చేస్తారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ పరిధిపై కలెక్టర్ మాట్లాడుతూ, ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ముందస్తుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి అవసరం లేదని, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్, బల్క్ ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ యాడ్స్‌కు ఎంసీఎంసీ అనుమతి అవసరమని వివరించారు. అనుమతిపొందిన ఆర్డరు కాపీ నెంబరును కూడా సంబంధిత ప్రకటనపై సూచించాల్సి వుంటుందన్నారు. ఈ విషయాన్ని అన్ని ప్రచార మాధ్యమాలు తప్పనిసరిగా గమనించాలని ఆయన కోరారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రకటనలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిగణిస్తూ చట్టం ప్రకారం తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ దిల్లీరావు తెలిపారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలకు ఎర్రజెండా పార్టీలను పంపండి

- రెండు జిల్లాల జనరల్ బాడీ సమావేశంలో సీపీఐ రామకృష్ణ



ఉమ్మడి జిల్లాల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

భవానీపురం, మార్చి 18 : ప్రజా సమస్యలపై నిత్యం గొంతెత్తే ఎర్రజెండాల పార్టీల ప్రతినిధులను చట్టసభలకు పంపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సితార ప్రాంతంలోని ఓ కన్వెన్షన్ హాల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సీపీఐ సమితుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ లోక్‌సభ,రాజ్యసభల్లో వైసీపీ ఎంపీలు అన్ని అంశాల్లో మోదీకి మద్దతు ఇచ్చారని, ఇప్పుడు పొత్తుతో మైండ్‌గేమ్‌ను ఏపీలో ఆడుతున్నారన్నారు. ప్రాంతీయ పార్టీలను మింగేయడమే బీజేపీ అజెండా ఉందన్నారు. సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేదని రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో 49 సీట్లు రెడ్డి సామాజిక వర్గానికి రెడ్డి కులస్తులు జీవిత భాగస్వామిగా ఉన్న ఎస్సీఎస్టీబీసీలకు మాత్రమే సీట్లు ఇచ్చారని దీనినే జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విజయవాడ పశ్చిమలో సీపీఐ గెలుపు ఖాయమని, రాష్ట్రంలో బీజేపీ ఓట్లు వేయరని రామకృష్ణ స్పష్టం చేశారు. పశ్చిమ నుంచి అభ్యర్థిని నిలుపుతున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెల్లి విల్సన్ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమం నుంచి 2004లో ఉన్న వామపక్షాల కూటమి ఈ సారి పోటీ చేస్తే విజయం సాధించవచ్చునన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి టి. తాతయ్యలు మాట్లాడారు.జాతీయకార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ, సీపీఐ సీనియర్ నాయకులు కొరగంజి జగన్‌లు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యా పీఠం పరీక్షలకు 93 శాతం హాజరు

- టెన్త్ పరీక్ష రాస్తూ పట్టుబడిన విద్యార్థి

వన్‌టౌన్, మార్చి 18 : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక విద్యాపీఠం టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు టెన్త్‌లో మాతృభాషలలో, ఇంటర్‌లో హిందీ, తెలుగు, ఉర్దులలో పరీక్షలు జరిగాయి. సింగ్‌నగర్‌లోని చైతన్య స్కూల్ సెంటర్‌లో పదో తరగతి పరీక్ష రాస్తున్న నకిలీ విద్యార్థిని ఇన్విజిలేటర్ పట్టుకున్నారు అసలు విద్యార్థి సీతారామయ్యకు బదులు మరో విద్యార్థి జోసఫ్ పరీక్ష రాస్తుండగా అధికారులు గుర్తించి జోస్ ఎఫై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీతారామయ్యను డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్, ఇంటర్‌లో మొత్తం 4862 మందికి గాను 306 మంది హాజరు కాలేదు 93.4 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీసీ బాబూరావు తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

- కేశినేని చిన్ని



పాయకాపురం, మార్చి 18 : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కేశినేని చిన్ని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేశినేని చిన్ని ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైకో జగన్ పాలన నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకురావాలంటే మళ్లీ నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమా, విశ్వబ్రాహ్మణ సామాజిక నేతలు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శన టికెట్లు రీసైక్లింగ్

- రోజుకు రూ. లక్ష పైనే స్వాహా
- ఈవో తనిఖీల్లో వెలుగుచూసిన వైనం
- ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు



వన్‌టౌన్, మార్చి18 : దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఉద్యోగుల చేతివాటం తగ్గడం లేదు. గతంలోనూ పలుమార్లు దర్శన టికెట్ల రీసైక్లింగ్ విషయంలో ఉద్యోగులను తప్పించిన వైనం తెలిసిందే. తాజాగా ఈవో తనిఖీల్లో దర్శన టికెట్లు రీసైకిలింగ్ చేసినట్టు గుర్తించారు. దేవస్థానంలో అమ్మవారి అంతరాలయ దర్శనానికి రూ.500, ముఖ ద్వార దర్శనానికి రూ.300, సాధారణ దర్శనానికి రూ.100 చొప్పున టికెట్ల రుసుములు ఉన్నాయి. దుర్గ గుడిలో అమ్మవారిని దర్శించుకోవడానికి శుక్ర, ఆదివారాలు, పర్వదినాలలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఇదే అదనుగా ఉద్యోగులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న వైనం బయటపడింది. రెండురోజుల క్రితం గర్భాలయం వెనుకపక్కన టికెట్ కౌంటర్‌లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆదినారాయణ, శర్మలు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీఐపీ దర్శనానికి ఐదుగురు భక్తులు రూ.500 టికెట్లను కొనుగోలు చేశారు. అయితే స్కానింగ్ చేయకుండా డైరక్ట్‌గా ఆలయంలోకి తీసుకుని వెళ్లారు. ఆ సమయంలో అంతరాలయం వద్ద క్యూలను నియంత్రిస్తున్న ఈవో వారిని గమనించి వారి వద్ద దర్శన టికెట్‌లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈక్రమంలో దర్శన టికెట్లను స్కానింగ్ చేయకపోవడాన్ని ఆయన గుర్తించారు. అయితే అంతరాలయానికి వచ్చే గేటువద్ద సిబ్బంది టికెట్‌లను పరిశీలించి కౌంటర్ ఫాయిల్ కట్ చేయాల్సి ఉంటుంది. కానీ కౌంటర్ ఫాయిల్ కట్ చేయకుండా టికెట్లను నేరుగా మళ్లీ కౌంటర్‌లోకి పంపించిన వైనాన్ని విచారణలో ఈవో గుర్తించారు. దీంతో మొత్తం ఆరాతీయగా చాలా పర్యాయాలు రద్దీ ఉన్న సమయంలో ఇలా జరుగుతోందని గుర్తించి ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనను ఆలయ అధికారులు గోప్యంగా ఉంచారు. రోజుకు కనీసం లక్ష రూపాయలకు పైగా అమ్మవారి సొమ్ము అక్రమ మార్గంలో చేతివాటం ప్రదర్శిస్తున్న ఉద్యోగుల జేబులలోకి వెళుతున్నట్టు గుర్తించారు. స్కానింగ్ పాయింట్ వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఈవో రామారావు ఆదేశాలు జారీ చేశారు. ఈఈ రమాదేవి క్షేత్రస్థాయిలో పరిశీలించి సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సరఫరా

- 20 నుంచి ట్యాంకర్ల ద్వారా పంపిణీ
- టెలీకాన్ఫరెన్స్‌లో కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలెక్టర్ సోమవారం తన చాంబరు నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెడన నియోజకవర్గంలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లో వేసవిలో తాగునీటి సమస్య అధికమయ్యే అవకాశం ఉందన్నారు. కృత్తివెన్ను మండలం ఇంతేరు, ఉప్పులూరు, రామాపురం, సీతారామపురం, మాట్లాం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి అధికమయ్యే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. బంటుమిల్లి మండలంలోని మల్లంపూడి, గార్లగుంట, వడ్లగరువు, మల్లంపూడి, కొత్తూరు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. పెడన మండలంలోని కమలాపురం, ఉప్పలకలవగుంట, గంటలమ్మపాలెం, కొప్పల్లె, ముచ్చిలిగుంట, ముచ్చర్ల, మూలమర్రిగుంట, గురివిందగుంట, కవిపురం, నేలకొండపల్లి, పెనుమల్లి, ఎస్వీపల్లి, దిరిశవల్లి, చోడవరం, పుల్లపాడు, చినపుల్లపాడు, దేవరపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి పొంచి ఉందన్నారు. ఈ గ్రామాలకు ఈనెల 20వ తేదీనుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించిన అనుమతులను మంజూరుచేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో తాగునీటి చెరువులు, అందులో ఉన్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదికను అందజేయాలన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు.

రూ.8 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్ : గరికపాడు అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం రాత్రి వాహన తనిఖీలు తనిఖీల్లో రూ.8 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి విజయవాడకు ద్విచక్ర వాహనంలపై వస్తున్న గార్లపాటి శేఖర్‌రెడ్డి వాహనం తనిఖీచేయగా నగదు లభించదని, విచారణ నిమిత్తం చిల్లకల్లు స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు.



డిఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న రంగన్నగూడెం సర్పంచ్ రంగామణి తదితరులు

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

- డీఆర్వోకు సర్పంచ్ వినతి

మచిలీపట్నం టౌన్, మార్చి 18 : బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామశివారు సింగన్నగూడెంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ కార్యదర్శి అల కల్యాణి ప్రోద్బలంతో వైసీపీ నాయకులు సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించారని డీఆర్వో చంద్రశేఖర్‌కు సర్పంచ్ కుసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పి.లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కోడ్‌ను ఉల్లంఘించిన పంచాయతీ కార్యదర్శి, వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వోను కలిసిన వారిలో గన్నవరం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, మొవ్వ శ్రీనివాసరావు, సింగన్నగూడెం మరీదు కృష్ణకుమారి ఉన్నారు.



ఎన్టీఆర్ జిల్లా బాధ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న టీజీ వెంకటేశ్

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

- టీజీ వెంకటేశ్

వత్సవాయి : ఆర్యవైశ్యులు వ్యాపారరంగాల్లోనే కాకుండా అన్ని రంగాల్లోను ముందుండాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. వత్సవాయిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావులతో కలిసి పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితమైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా బొగ్గవరపు రాజారావు ఎన్నికయ్యారని ఆయన సేవా నిరతిని ప్రశంసించారు. పెనుగొండ సుబ్బారాయుడు, జయంతి వెంకటేశ్వర్లు, కొప్పురావూరి రజిని తదితరులు పాల్గొన్నారు.

వేదవ్యాస్‌కు రవీంద్ర పరామర్శ

మచిలీపట్నం టౌన్, మార్చి 18 : అస్వస్థతకు గురై విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం పరామర్శించారు. మచిలీపట్నంలో చికిత్స పొందుతున్న వేదవ్యాస్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. దీంతో విజయవాడలో చికిత్స పొందుతున్న వేదవ్యాస్‌ను రవీంద్ర పరామర్శించి ధైర్యం చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 117, 128
చికెన్ విత్ స్కిన్	202
చికెన్ స్కిన్‌లెస్	212



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

ఎన్నికల నియమావళిని పాటించాలి

గన్నవరం, మార్చి 18 : ఎన్నికల నియామావళిని తప్పనిసరిగా పాటించాలని లేకుంటే తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని సహాయ రిటర్నింగ్ అధికారి పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఎన్నికలు నిర్వహించే రోజు వరకూ ఎన్నికల ప్రవర్తన నియామవళిని పాటించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలు ప్రదర్శించుటకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. ప్రకటనల సంఖ్య, వివరాలు తెలపాలని చెప్పారు. ప్రచార వాహనాలకు అనుమతి పొందాలని, ప్రదర్శనలు, ప్రకటనలు అసాంఘికంగా ఉండకూడదన్నారు. ఎన్నికల నియామావళిని అమలుపరిచేందుకు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాదంలో
భారీగా ఆస్తినష్టం



గోదాము శుభ్రపరుస్తున్న కూలీలు

ఆకునూరు, మార్చి 18 : ఆకునూరు పాత ప్లాస్టిక్ గోదాములో ఆదివారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో మంటలను సోమవారం ఉదయానికి అగ్నిమాపక సిబ్బంది ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో గోదాములోపల, బయట ఆవరణ, సర్వీసు రోడ్డుపక్క ఉంచిన పాత ప్లాస్టిక్, పాతఇనుప సామాను నుంచి ఉవ్వెత్తున్న మంటలు, పొగలేవడంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారు భయాం దోళనకు గురయ్యారు. కేజీకి నాలుగు రూపాయలు ధర తగ్గిందని, నాలుగు రోజులు గడిస్తే ధర పెరుగుతుందేమో అన్న ఆశతో భారీ మొత్తంలో పాతప్లాస్టిక్, ఇనుము గ్రేడింగ్‌చేసి కట్టలు కట్టి నిల్వ ఉంచితే అగ్నిప్రమాదంలో అంతా కాలి బూడిదయ్యిందని యజమాని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈ ప్రమాదంలో ప్లాస్టిక్, ఇనుము సమానుతో పాటు గోదాము షెడ్డులు దగ్ధంకాగా భారీగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు బోరుమన్నారు.

యనమలకుదురులో
నేడు వైద్యశిబిరం

పెనమలూరు, మార్చి 18 : యనమలకుదురు బోసు బొమ్మ సెంటర్ వద్ద ఉన్న మొక్కపాటి శ్రీనివాస్ ఆవరణలో మొక్కపాటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నేడు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ తెలిపారు. శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో షుగరు, బీపీ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

ముదునూరు(ఉయ్యూరు), మార్చి 18 : సొసైటీ సభ్యుల సంక్షేమం, అభ్యున్నతికి జిల్లా సహకార బ్యాంకు కట్టుబడి ఉందని ముదునూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ అన్నారు. సంఘ సభ్యురాలు డెక్కా విశ్రాం తమ్మ ఇటీవల మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం సంఘ నిధులనుంచి రూ. 10వేలు సోమవారం ఆమె కు టుంబ సభ్యులకు చైర్‌పర్సన్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో సంఘాలలోని సభ్యులకు సహాయం చేసేందుకు నిధులు సంఘాల ద్వారా సమకూర్చుతుందన్నారు. సంఘ సీఈవో తుమ్మల శ్రీనివాసరావు, సభ్యులు కుర్రా వెంకటే శ్వరరావు, చిందా కృష్ణమోహన్‌రాజు, వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

కంకిపాడు : షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నాయకులు, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. కంకిపాడులో షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రూ. 7 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండి నాంచారయ్య, కొప్పరాజు సురేష్, చలవాది రాజా, గోగినేని వెంకటరమణ, కొణతం గిరిధర్, కోలవెన్ను విజయ్, గుమ్మడి కిరణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు జైలు

గన్నవరం, మార్చి 18 : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు సోమవారం గన్నవరం 12వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జక్కులనెక్కలంకు చెందిన కాట్రు ఉమామహేశ్వరరావు 2019 సెప్టెంబరు 8న మరొకరితో కలసి విజయవాడ వైపు వెళుతున్నాడు. గూడవల్లి క్రాస్ అయ్యే సమయంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు తీవ్రగాయాలు అయ్యి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పర్రె శివప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా నేరం రుజువు కావటంతో గన్నవరం 12వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి నిందితుడికి ఆరు నెలల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వాహనాల తనిఖీ

కంకిపాడు, మార్చి 18 : ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో నియోజకవర్గం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కనకమహాలక్ష్మి పునాది పాడులో వాహనాలు విస్తృతంగా తనిఖీ చేశారు. పునాదిపాడు నుంచి విజయవాడ, గన్న వరం వైపు వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఎక్కడికి వెళ్తున్నారు.. వాహ నాల డిక్కీ, డాష్ బోర్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కనక మహాలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో విస్తృతంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పది పరీక్షలు ప్రారంభం



ఉయ్యూరులో ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్న పోలీసులు

ఉయ్యూరు, మార్చి 18 : ఉయ్యూరు, మండల పరిధిలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉయ్యూరు పట్టణ పరిధిలో ఆరు, ఆకునూరు ప్రభుత్వ హైస్కూల్‌లో, కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. నిర్ణీత సమయానికి అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా వారిని తనిఖీచేసి లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎనిమిది కేంద్రాల్లో 1480 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 1425 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి తెలిపారు.

గన్నవరం : మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పది పాఠశాలల్లో జరిగిన పరీక్షకు 1063 మంది హాజరైనట్లు ఎంఈవో రవికుమార్ తెలిపారు. దావాజీగూడెంలో 230, గొల్లనపల్లి 132, వెదురుపావులూరు 116, వీరపనేనిగూడెం 110, గన్నవరం బాలుర హైస్కూల్ 270, బాలికల హైస్కూల్ 182, శ్రీమల్లికార్జున 11, లిటిల్‌లైట్స్ 20 మంది పరీక్షలు రాశారు. మొత్తం 1155 మందికి 1063 మంది రాయగా 19 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పదవ తరగతి పరీక్షలు మండల వ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. బాపులపాడు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ, 896మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేశారు. వీరి కోసం వీరవల్లి, బాపులపాడు, కానుమోలు, ఆరుగొలను, తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పరీక్షలకు 827మంది హాజరు కాగా, 68మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో రాంబాలాసింగ్ తెలిపారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించే ముందు వారిని తనిఖీలు చేశారు. సీఐ నరసింహ మూర్తి ఆధ్వర్యంలో వీరవల్లి ఎస్సై చిరంజీవి, హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్దన్ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది పహారా నిర్వహించారు.

ఉంగుటూరు : మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగుపరీక్ష కావడంతో ఉదయం నుంచే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యా ర్థులను కూడా పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మండల వ్యాప్తంగా ఐదు ప్రభుత్వ జడ్పీహైస్కూల్స్, రెండు ప్రైవేట్ హైస్కూల్స్ కలిపి మొత్తం ఏడు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 677మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సివుండగా మొదటిరోజు 29మంది గైర్హాజరయ్యారు. 648 విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసినట్లు మండల విద్యాశాఖాధికారులు కె.రవికుమార్, జె.సాంబశివరావు తెలిపారు.

వీఆర్ సిద్ధార్థలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో విద్యార్థులు

పెనమలూరు, మార్చి 18 : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తరఫున ఏడురోజుల ప్రత్యేక శిబిరాన్ని సోమవారం నుంచి ప్రారంభించినట్టు ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్ర తెలిపారు. తాడిగడపలో ప్రారంభమైన ఈ ప్రత్యేక శిబిరాన్ని జేఎన్‌టీయూ కాకినాడ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్యాం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ, ప్రజలకు ఉప యోగపడేలా టెక్నాలజీని వాడాలని విద్యార్థులు వారి జ్ఞానాన్ని సమాజహితం కోసం వాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మజానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ పాల్గొన్నారు.

లయన్స్ సేవలు విస్తృతం చేద్దాం

క్లబ్ జిల్లా గవర్నర్ శంకరగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న శంకరగుప్తా

పెనమలూరు, మార్చి 18 : లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జేఎన్ శంకరగుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం కానూరులోని అన్నే రామతులసి కళ్యాణ మండపంలో జరిగిన క్లబ్ నాల్గవ క్యాబినెట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో లయన్స్ క్లబ్ చేసిన సేవలను గుర్తు చేస్తూ మరిన్ని సేవలను సమాజానికి అందించేందుకు ప్రతి సభ్యుడూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో క్లబ్ వార్షిక నివేదిక ప్రతులను సభ్యులకు అందించారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన డిస్ట్రిక్ట్ మెంటార్లు కత్తిక శివనాగేశ్వరరావు, అన్నే శివనాగేశ్వరరావులను అభినందించారు. కార్యక్రమంలో మొదటి, రెండవ డిస్ట్రిక్ట్ గవర్నర్లు గద్దే శేషగిరి, వీవీపీఎస్ అంజనేయులు, జిల్లా మాజీ గవర్నర్ శ్రీశాంతి, ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, జమాక్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు త్రిపురనేని నాగచంద్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, తోటకూర చంటి, హరిబాబు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బియ్యం వేలం వాయిదా

మచిలీపట్నం టౌన్, మార్చి 18: కృష్ణాజిల్లాలోని వివిధ రేషన్ షాపుల నుంచి అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న 258 టన్నుల బియ్యాన్ని సోమవారం వేలం వేస్తే ఆశించినంత ధరకు వ్యాపారులు పాడలేదు. దీంతో వేలాన్ని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ వాయిదా వేశారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది ప్రకటించలేదు. పౌరసరఫరాల జిల్లా అధికారి పార్వతి సమక్షంలో నిర్వహించిన వేలానికి ఆరుగురు వ్యాపారులు వచ్చినా ఆశించినంత ధరకు వారు పాడలేదు.

ప్రజలు నన్నే ఆదరిస్తారు

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



తాడిగడప శ్రీనివాసనగర్ కట్టపై పాదయాత్రలో బోడె ప్రసాద్ తదితరులు

పెనమలూరు, మార్చి 18 : పదవిలో ఉన్నా.. లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉన్న నన్ను ప్రజలు ఆదరిస్తారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం తాడిగడప శ్రీనివాసనగర్ కాల్వకట్టపై కుటుంబ సభ్యులతో ప్రజలను కలిసి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రకరకాల వార్తలు వింటున్న తాము బోడె ప్రసాద్‌కు మద్దతుగా నిలబడతామని స్థానికులు చెబుతున్నారన్నారు. తన పట్ల ప్రజల్లో అమితమైన ప్రేమ ఉందని ఎట్టి పరిస్థితుల్లోనూ తనను గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారని, చంద్రబాబుపై తనకు అపార నమ్మకం ఉందని, తనకు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బోడె హేమ, వైష్ణవి, వెంకట్రామ్, అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, జంపన గుర్నాధం, బండి గోపాలకృష్ణ, కోయ ఆనంద్‌ప్రసాద్, పీతా గోపిచంద్, తుమ్మల రాంకుమార్, మన్నె రాజబాబు, తాతినేని రామకోటేశ్వరరావు, పోలవరపు బాబీ, మేడసాని రత్నకుమారి, కుమార్, అనంతనేని ఆజాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి



బాపులపాడులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్, మార్చి 18 : వైసీపీ పాలనలో ఫ్యాక్షన్ తరహా రాజకీయాలతో అభివృద్ధి కుంటుపడిన గన్నవరం నియోజకవర్గాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో తిరిగి అభివృద్ధి చేయడానికి రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు మద్దతుగా నిలవాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు కోరారు. సోమవారం శంఖారావం కార్యక్రమంలో భాగంగా బాపులపాడులోని సాయిబాబా గుడి ఏరియాలో టీడీపీ, జనసేన ఉమ్మడిగా విడుదల చేసిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో యార్లగడ్డను గెలిపించాలని నాయకులు కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మూల్పూరి సాయికల్యాణి, వీరమాచనేని సత్యప్రసాద్, వడ్డిల్లి లక్ష్మి, వడ్డి శివ నాగేశ్వరరావు, యలమంచిలి వెంకటేశ్వరరావు, గార్లపాటి రాజేశ్వరరావు, పరుచూరి నవీన్, పోతుమర్తి సత్యనారాయణ, కాకుల శ్రీను, యార్లగడ్డ సత్యనారాయణ, మాకినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం!

- తాడిగడప మునిసిపాలిటీలో ఎటుచూసినా చెత్తే
- వెదజల్లుతున్న దుర్గంధం
- విజృంభిస్తున్న దోమలు, రోగాల పాలవుతున్న స్థానికులు



కానూరు నాగార్జున ఆసుపత్రి సమీపంలో పేరుకుపోయిన చెత్త

పెనమలూరు, మార్చి 18 : తాడిగడప మునిసిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పంట కాల్వ రోడ్డు పొడవునా ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. చెత్తకుప్పలను తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రోడ్ల వెంట వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభించడంతో స్థానికులు రోగాల పాలై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలిగించి బ్లీచింగ్ చల్లాల్సిన శానిటరీ విభాగం ఆ ఊసే మరిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలిగించే బాధ్యత తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో రోడ్లన్నీ చెత్తతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉంగుటూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఓటర్లకు భరోసా కల్పించేందుకే..

ఉంగుటూరు, మార్చి 18 : త్వరలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు, పోలీసులు ఎల్లవేళలా తోడుంటారనే నమ్మకం, మనోధైర్యం ప్రజల్లో కలిగించేందుకు ఫ్లాగ్‌మార్చ్ కవాతు నిర్వహించినట్లు ఉంగుటూరు ఎస్సై వి.రవిచంద్రకుమార్ తెలిపారు. మండలంలోని ఇందుపల్లి, ఉంగుటూరు గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సోమవారం కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహించారు. తహసీల్దార్ జేవీ సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఓటర్లకు భరోసా, భద్రత కల్పించేందుకు, ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా, సక్రమంగా వినియోగించుకునేలా వారిలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సత్తార్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

కాశీలో ప్రత్యేక పూజలు

విజయవాడ రూరల్ : వచ్చే ఎన్నికల్లో నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షిస్తూ సోమవారం కాశీలో ఆ పార్టీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత దూళిపాళ్ల దేవేంద్ర ఆధ్వర్యంలో సహస్ర లింగార్చన సహిత మహాపాశుపత అభిషేకం, ప్రత్యేక హోమం నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 117, 128
చికెన్ విత్ స్కిన్	202
చికెన్ స్కిన్‌లెస్	212

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

అవనిగడ్డ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.రేఖారాణి

అవనిగడ్డ, మార్చి 18: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇంటర్మీడియట్ బోర్డులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పి.రేఖారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేఖారాణిని అధ్యాపకులు ఎస్.దిలీప్‌కుమార్, దుడ్డు కృష్ణారావు, అన్నపరెడ్డి శ్రీనివాసరావు, యూడీ వెంకటస్వామి అభినందించారు.

బియ్యం వేలం వాయిదా

మచిలీపట్నం టౌన్, మార్చి 18: కృష్ణాజిల్లాలోని వివిధ రేషన్ షాపుల నుంచి అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న 258 టన్నుల బియ్యాన్ని సోమవారం వేలం వేస్తే ఆశించినంత ధరకు వ్యాపారులు పాడలేదు. దీంతో వేలాన్ని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ వాయిదా వేశారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది ప్రకటించలేదు. పౌరసరఫరాల జిల్లా అధికారి పార్వతి సమక్షంలో నిర్వహించిన వేలానికి ఆరుగురు వ్యాపారులు వచ్చినా ఆశించినంత ధరకు వారు పాడలేదు.





చల్లపల్లి రాజా కళాశాలలో పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు, మొవ్వ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు, అర్తమూరులో పరీక్ష రాశాక..

సజావుగా తెలుగు పరీక్ష

తొలిరోజు పదో తరగతి పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అధికారులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. తొలి పరీక్ష తెలుగు సజావుగా ముగిసింది. దూరప్రాంతాల విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.



మోపిదేవిలో..

నాగాయలంక, మార్చి 18: నాగాయలంక -1 కేంద్రంలో 158 మందికి 140 మంది విద్యార్థులు హాజరయ్యారు. నాగాయలంక-2 కేంద్రంలో 133 మందికి 117 మంది, తలగడదీవి కేంద్రంలో 93 మందికి 78 మంది హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులు కేంద్రాలకు తోడుగా వచ్చారు. పరీక్షల సందర్భంగా పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తూ పికెట్ ఏర్పాటు చేశారు.

మోపిదేవి: మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 177 మందికి 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 70 మంది, పెదకళ్లేపల్లి జడ్పీ పాఠశాలలో 93 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో-1 దుర్గాసాగర్ తెలిపారు.

ఘంటసాల: మండలంలోని ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళంలోని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. శ్రీకాకుళం కేంద్రంలో 113 మందికి 101 మంది హాజరు కాగా, ఘంటసాల కేంద్రంలో 82 మందికి 80 మంది, కొడాలి కేంద్రంలో 66 మందికి 61 మంది హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో 18 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

కూచిపూడి: మొవ్వ మండలంలో ఆరు కేంద్రాల్లో రెగ్యులర్, సప్లమెంటరీ విద్యార్థులు 601 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 21 మంది గైర్హాజరు కావటంతో 580 మంది పరీక్షలు రాశారు.

గుడివాడ : నియోజకవర్గంలో 13 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

కోడూరు: మండలంలో రెండు పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 359 మందికి 350 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో టి.వి.ఎం. రామదాసు తెలిపారు.

పామర్రు: మండలంలోని ఐదు కేంద్రాల్లో 752 మందికి 708 మంది విద్యార్థులు హాజరయ్యారని, 44 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో జి.పద్మవాణి తెలిపారు.

మూడు కేంద్రాల్లో కానరాని వైద్య సిబ్బంది

బంటుమిల్లి: మండలంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తే అర్తమూరు, పెదతుమ్మిడి, చోరంపూడి పరీక్షా కేంద్రాల్లో వైద్యసిబ్బంది లేరు. దీనిపై మండల వైద్యాధికారి పవన్‌ను వివరణ కోరగా తమకు నాలుగు పరీక్షా కేంద్రాలకు మాత్రమే వైద్య సిబ్బందిని నియమించేందుకు ఆదేశాలు వచ్చా యన్నారు. మిగతా పాఠశాలలో వైద్య సిబ్బందిని నియమించేందుకు ఎలాంటి ఆదేశాలు లేవన్నారు. ఎంఈవో-2 వెంకటేశ్వరరావును అడగ్గా.. పరీక్షా కేంద్రం లోపలికి వెళ్లి సిబ్బందితో మాట్లాడి వచ్చారు. వైద్యసిబ్బంది ఎవరూ లేరని చెప్పారు. తనకు ఎలాంటి సమాచారం, ఆదేశాలు రాలేదని ఏఎన్ఎం కరుణ తెలిపారు. అధికారులు తెలుసుకుని ఆలస్యంగా సిబ్బందిని పంపినట్టు తెలిసింది.

సరస్వతీదేవికి పూజలు చేసి పరీక్షకు...

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ గురుకుల విద్యాల యంలో సర స్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశాక అవనిగడ్డ లోని పరీక్షా కేంద్రాలకు 72 మంది విద్యార్థులు తరలివెళ్లారు. ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో 436 మందికి 413 మంది విద్యార్థులు పరీక్ష రాశారని 23 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో గోపాలరావు తెలిపారు. గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్, కౌతవరం, డోకిపర్రు, అంగలూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు.

చల్లపల్లి: చల్లపల్లి మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 839 మందికి 826 మంది పరీక్షలకు హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పరీక్షలను పర్యవేక్షించారు.

ఎంపీ బాలశౌరికి యానాది మహానాడు ధన్యవాదాలు

అవనిగడ్డ, మార్చి 18: నియోజకవర్గంలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో నివశిస్తున్న యానాదుల సంక్షేమం కోసం నాబార్డు ద్వారా ఆర్థిక సహకారం అందించేందుకు కృషి చేసిన ఎంపీ బాలశౌరికి యానాది మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు కృతజ్ఞతలు ఒక ప్రకటనలో తెలిపారు. యానాదుల జీవనోపాధి మెరుగు కోసం నాబార్డు నుంచి 500 కుటుంబాలకు రూ.3కోట్లు విడుదల చేయించటంలో ఎంపీ బాలశౌరి చేసిన కృషిని తాము మరువబోమని ఆయన పేర్కొన్నారు.

భీమేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.3.76 లక్షలు

గుడివాడ: భీమేశ్వరస్వామి దేవస్థానంలో 108 రోజులకు నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.3,76,515, గౌరీశంకరస్వామి దేవస్థానంలో 57రోజులకు నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.1,34,183 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి షణ్ముఖ నటరాజన్ తెలిపారు. సోమవారం రెండు దేవస్థానాల ఆవరణలో మోటూరు ఆలయ కార్యనిర్వహణాధికారి మౌనిక పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు.

పెడనలో ఎన్నికల హెల్ప్‌డెస్క్

పెడన రూరల్: పెడన నియోజకవర్గ హెల్ప్‌లైన్ డెస్క్‌ను తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ ప్రారంభించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఫిర్యాదులను 08672- 248341కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఐదుగురికి ఉద్యోగాలు

గుడ్లవల్లేరు, మార్చి 18: నిర్మాణ రంగ సంస్థ కల్పతరు ప్రాజెక్ట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. రూ.2.75 లక్షల వార్షిక వేతనానికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

మృతుడి కుటుంబానికి బుద్ధప్రసాద్ పరామర్శ

మోపిదేవి, మార్చి 18: మోపిదేవిలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన కొండేటి గోపీకృష్ణ కుటుంబసభ్యులను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరామర్శించారు. మృతుని తండ్రి గాంధీ, కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

అడపా బాబ్జీకి ఘన నివాళి

గుడివాడ : శరత్ థియేటర్‌లోని వైసీపీ కార్యాలయంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ అడపా వెంకటరమణ(బాబ్జీ) 3వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి దుక్కిపాటి శశిభూషణ్, గొర్ల శ్రీను తదితరులు ఘన నివాళులర్పించారు.



మూరినగర్ మసీదు వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న కొల్లు రవీంద్ర

మైనార్టీల సమస్యలు పరిష్కరిస్తాం

- కూటమిని అధికారంలోకి తెండి
- ముస్లింలకు కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, మార్చి 18: మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక మైనార్టీల సమస్యలు పరిష్కరిస్తామని కూటమిని అధికారంలోకి తేవాలని ముస్లింలకు కూటమి మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. 34వ డివిజన్ నూరినగర్‌లో మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. నూరినగర్‌లో 1200 ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, స్మశానానికి స్థలం కావాలని రవీంద్రను నూరినగర్ మసీదు కమిటీ సభ్యుడు కోరారు. మదర్సా భవననిర్మాణం పూర్తి అయ్యేందుకు సహాయం అందించాలన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే ఎన్డీఏతో కలిశామని, బీజేపీతో పొత్తు వల్ల ముస్లింలకు ఏ ఇబ్బందీ రాదని, ప్రతిపక్షాలు మత సామరస్యంపై విభేదాలు సృష్టించేందుకు చూస్తున్నాయని వీటిని నమ్మొద్దని ముస్లింలను రవీంద్ర కోరారు. ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్, ఇమాం, ఇబ్రహీం, టీడీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాజా, ఇలియాస్ పాషా, మోటమర్రి బాబాప్రసాద్, ఖాలేషా, అమీర్, హసీమ్‌బేగ్, అజీం, భాజాని పాల్గొన్నారు.



పెడనలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాగిత కృష్ణప్రసాద్

రాక్షసపాలన అంతం చేద్దాం

- కూటమికి విజయాన్ని చేకూరుద్దాం: కాగిత కృష్ణప్రసాద్

పెడన రూరల్: రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేద్దామని, రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి విజయాన్ని చేకూర్చాలని కూటమి పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. 12, 13 వార్డుల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కృష్ణప్రసాద్‌కు సన్మానం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూటమిని అధికారంలోకి తేవడమే తమ లక్ష్యమని సంఘం మచిలీపట్నం పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి దాలిపర్తి ప్రసాద్, జిడుగు అశోక్‌కుమార్, ఆముదాలపల్లి గోపాలకృష్ణ, కోరిమిల్లి వెంకటస్వామి, వేములవాడ జనార్దన్ తెలిపారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కౌన్సిలర్ మట్టా శివపావని, కూనపరెడ్డి రంగయ్యనాయుడు, వరుదు కొండ, మామిడి లక్ష్మీనారాయణ గుప్త, కొల్లూరి రాధాకృష్ణగుప్త, పొతర్లంక నాగేశ్వరరావు, చందన నారాయణ రావు, యక్కల శ్యామలయ్య, వాహబ్‌ఖాన్, హమీదుల్ల, బొడ్డు దీక్షానందుడు తదితరులు పాల్గొన్నారు.



పెదపుల్లపాడులో పాలకేంద్రం సభ్యులను సన్మానిస్తున్న చలసాని ఆంజనేయులు

పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

పెడన రూరల్: పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. చోడవరం, పెదపుల్లపాడు గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. సభ్యుల సంక్షేమానికి, వారి ఆర్థికాభివృద్ధికి సంస్థ అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు బోనస్ పంపిణీ చేశారు. ఉచిత పశు వైద్య శిబిరాలను, రాయితీలతో కూడిన పథకాలను సద్వినియోగం చేసుకుని లాభాలు పొందాలని రైతులకు ఆయన సూచించారు. అర్జా వెంకట నగేష్, తోట సత్యనారాయణ, గూడవల్లి నాగరాజు, ఊచ జ్వాలాబాబు, బసవ రాజకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రంగు పడింది



నాగపోతరావు సెంటర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌పై రంగులు పూస్తున్న మునిసిపల్ సిబ్బంది

మచిలీపట్నం టౌన్/ అవనిగడ్డ రూరల్: మచిలీపట్నం నగరంలో గోడలపై వైసీపీ ప్రచార పోస్టర్లపై రంగులు పూశారు. దివిసీమలో ముఖ్యమంత్రి జగన్ పర్యటనలో వేకనూరులో వివిధ ప్రాంతాల్లో చెట్లపై వైసీపీ రంగులు వేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటిపై అధికారులు తెల్లరంగులు వేయిస్తున్నారు.



వేకనూరులో చెట్లపై ఉన్న వైసీపీ రంగులపై తెల్లరంగు వేస్తున్న సిబ్బంది

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

ఏఆర్వోలకు ఆర్డీవో వాణి ఆదేశం

మచిలీపట్నం టౌన్, మార్చి 18: మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించేలా చూడాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు, అకౌంట్ ఆఫీసర్లను ఆర్డీవో, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.వాణి ఆదేశించారు. సోమవారం ఆర్డీవో చాంబర్‌లో నియోజకవర్గానికి నియమించిన నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ సతీష్, సర్వేశాఖ ఏడీ టి.వెంకటేశ్వరరావు, ఆర్డీవో కార్యాలయ ఏవో లక్ష్మీతోపాటు, ఎంపీడీవో నోడల్ అధికారి ప్రసాద్, ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చే అధికారులు, అకౌంట్ ఆఫీసర్లు, మీడియా పరిశీలకులతో ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో పోలింగ్‌కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రదర్శించిన ఫ్లెక్సీలు తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేనిదే రాజకీయ నాయకులు ఏ విధమైన ప్రకటనలు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు హెచ్చరిక

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ నాయకులందరూ అధికారులకు సహకరించాలని, ఒకవేళ కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు హెచ్చరించారు. సోమవారం బాపిరాజు మీడియాతో మాట్లాడారు. రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వాణి ఆదేశాల మేరకు నగరంలో ఉన్న వందలాది రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించామన్నారు. గోడలపై రాసిన ఎన్నికల ప్రచార వాల్‌పేపర్లు, పెయింటింగ్‌లను తొలగిస్తున్నామన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నామన్నారు.

కోడ్ అమలుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

పామర్రు నియోజకవర్గ ఆర్వో శ్రీదేవి

పామర్రు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ఎవరూ తమ అనుమతిలేనిదే నియోజకవర్గంలో ఎక్కడా రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లు పెట్టొదని అన్ని రాజకీయపార్టీల నేతలు సహకరించాలని పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి శ్రీదేవి కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో పౌరులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సంఘ ప్రవర్తన నియామవళి సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఐదు ఎంసీసీ టీమ్‌లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మూడు సర్వెలైన్స్ టీమ్‌లను నియమించామన్నారు. ఈనెల 16నుంచి మే 13న ఎన్నికలు ముగిసే వరకు ఆ బృందాల అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలోని పామర్రుతో పాటు నాలుగు మండలాల్లో ఇప్పటికే అన్ని పోస్టర్లు, బ్యానర్లను తొలగించామన్నారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగామన్నారు. ఎన్నికల సంఘ ఆదేశాల అమలుకు నియమించిన ప్రత్యేక బృందాలు గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తాయన్నారు. టీమ్‌లకు జీపీఆర్ఎస్ అమర్చిన వాహనాలను సమకూర్చామన్నారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయండి

అవనిగడ్డ: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సునీల్‌కుమార్ నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా పనిచేసి ఎన్నికల విధుల్లో లోటుపాట్లు లేకుండా చూడాలని ఆయన సూచించారు.

విగ్రహాలకు ముసుగులు.. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు

మచిలీపట్నం టౌన్, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను, హోర్డింగ్‌లపై ఉన్న బ్యానర్లను మునిసిపల్ సిబ్బంది తొలగించారు. కోనేరుసెంటర్, జిల్లాపరిషత్, రేవతి సెంటర్ల తోపాటు పలు కూడలి ప్రాంతాల్లోని ఫ్లెక్సీలు తొలగించారు. నియోజకవర్గంలో ఉన్న ఎన్టీఆర్, వైఎస్సార్, రాజీవ్‌గాంధీ తదితర నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. మచిలీపట్నం నగరంలో కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ బాపిరాజు ఆధ్వర్యంలో వందలాది ఫ్లెక్సీలను సోమవారం తొలగించి ట్రాక్టర్లపై తరలించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు గోడలకు అంటించిన ఎన్నికల ప్రచార పోస్టర్లపై రంగులు పూశారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు తొలగింపును ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చేపట్టారు. నగరంలోని 50 సచివాలయాల పరిధిలోని కార్యదర్శులకు ఫ్లెక్సీల తొలగింపుపై ఆదేశాలు జారీ చేశారు. దీంతో కార్యదర్శులు, మునిసిపల్ సిబ్బంది ఆపనుల్లో నిమగ్నమయ్యారు.



బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం ముఖానికి వేసిన ముసుగు



ఆర్వో బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చెట్లు, స్తంభాలపై వైసీపీ రంగులు తొలగించండి

అవనిగడ్డ, మార్చి 18: నియోజకవర్గ వ్యాప్తంగా చెట్లు, స్తంభాలపై ఉన్న వైసీపీ రంగులు తొలగించాలని అవనిగడ్డ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యానికి తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు అవనిగడ్డకు వచ్చిన సందర్భంగా రోడ్డు పక్కన చెట్లకు వైసీపీ జెండాకు రంగులు వేశారని, కరెంట్ స్తంభాలపై 'వై నాట్ 175' అని రాయించారని, శిలాఫలకాలపై నాయకుల ఫొటోలు ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బండే రాఘవ, బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహనరావు, మేడికొండ విజయ్, దాసినేని శ్రీను, యలవర్తి చిన్నా, షేక్ బాబావలి, కొల్లూరి వాసు, రేపల్లె అంకినీడు, కొల్లూరి ఇమ్మానియేలు, చంద్రమోహన్ పాల్గొన్నారు.